ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు 5

సోమవారం 29 జూలై 2024



నేడు ఫిర్యాదుల స్వీకరణ

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: నంద్యాలలోని కలెక్టరేట్ సెంటినరి హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెసెల్ సిస్టం ద్వారా చేపట్ట నున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని ఆమె సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజ కవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.



రాజసానికే రారాజు

- ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన వన్యప్రాణి పెద్దపులి
- ఎన్ఎస్‌టీఆర్‌లో పెరిగిన పులుల సంతతి
- సంరక్షణలో దేశానికే తలమానికంగా నల్లమల
- నేడు వరల్డ్ టైగర్స్ డే



ఆత్మకూరు, జూలై 28: బంగారు ఛాయ.. నలుపు రంగు చారలతో ఆకర్షణీయంగా ఉండే పెద్దపులి వన్యప్రాణుల్లోనే తిరుగులేని రారాజుగా కీర్తి గడించింది. ఇది ఎంతటి గాంభీర్యంగా కనిపిస్తుందో అంతే క్రూరత్వాన్ని కలిగి ఉంటుంది. మిగతా వన్యప్రాణుల కన్నా పెద్ద పులి జీవన విధానం భిన్నంగా ఉంటుంది. వాస్తవానికి వేల సంవత్సరాల నుంచే భూమిపై పెద్దపులులు తమ ఉనికిని చాటుకున్నాయి. అయితే 20వ శతాబ్దం ఆరంభం నుంచి ప్రపంచ వ్యాప్తంగా పులుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. దీంతో పర్యావరణ పరిరక్షణలో త్రికోణ అగ్ర భాగాన నిలిచిన పులులను సంరక్షించేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఇందులో భాగంగానే 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో టైగర్స్ సమ్మిట్‌ను నిర్వహించి 2022 నాటికి రెట్టింపు సంఖ్యలో పులుల సంతతిని పెంచాలని నిర్ణయించారు. అలాగే 13 దేశాల శిఖరాగ్ర సదస్సులో పులుల సంతతి ఉన్న దేశాల్లో ప్రతిఏటా జూలై 29వ తేదీన వరల్డ్ టైగర్స్ డేను నిర్వహించాలని ప్రకటించారు. ఈ క్రమంలో 1972 నవంబరు 18వ తేదీన పెద్దపులిని జాతీయ జంతువుగా ప్రకటించి వాటి సంరక్షణ కోసం భారతదేశం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేసింది. సోమవారం 'వరల్డ్ టైగర్స్ డే' సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం.

శేషాచలం కారిడార్‌లోకి పెద్దపులి

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో పెద్దపులుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఇదే క్రమంలో పులి ఆవాస పరిధిని దాటి శేషాచలం అడవుల వైపు మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గతంలో రెండు పులులను కడప జిల్లా పరిధిలోని లంకమల అటవీ ప్రాంతంలో గుర్తించారు. అలాగే చిత్తూరు జిల్లా పరిధిలోని శేషాచలం అడవిలో కూడా ఓ పెద్దపులి ఉన్నట్లు నిర్ధారించారు. అంతేగాకుండా గత ఏడాది నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు సమీప అటవీ ప్రాంతంలో కూడా ఓ పులి పాదముద్రికను అటవీ అధికారులు గుర్తించారు. కాకినాడ, ఏలూరు జిల్లాల పరిధిలోని పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో రెండు పులులు ఉన్నట్లు వెల్లడైంది. దీన్నిబట్టి నల్లమలలో పులుల సంతతి పెరగడంతోనే వాటి ఆవాసాన్ని పెంచుకునేందుకే పులుల ఇతర ప్రాంతానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే పులి సంచారాన్ని శేషాచలం అడవుల్లోకి విస్తరించాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నల్లమలలో పులుల సంఖ్య రెట్టింపవుతున్న క్రమంలో టైగర్ కారిడార్‌ను పెంచే అవకాశం ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు.

పెద్దపులుల ప్రాదేశిక ప్రవర్తన ఇలా ..

పులులు సాధారణంగా ఒంటరిగానే జీవనం సాగిస్తాయి. పులి సంచరించే ప్రాంతాన్ని పెద్దపులి టెరిటరీగా భావిస్తారు. ఆడపులి సుమారు 20 చదరపు కి.మీ. వరకు తన నివాస స్థానాన్ని ఎంచుకోగా, మగపులి 60 నుంచి 100 చదరపు కిమీల విస్తీర్ణాన్ని నివాస స్థావరంగా ఏర్పరచుకుంటుంది. అది జీవించే ప్రాంతంలోకి తనకు హాని కలిగించే మరే ఇతర జంతువును కూడా తన టెరిటరీలోకి ప్రవేశించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది.




దేశానికే తలమానికం నల్లమల

నల్లమలలో విస్తరించిన నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పులుల సంరక్షణలో దేశానికే తలమానికంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82 చ.కి.మీల పరిధిలో విస్తరించి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఇందులో 2444 చ.కి.మీ. కోర్ ఏరియా ఉండగా, 1283.82 కి.మీ. బఫర్ ఏరియా గుర్తించారు. కాగా గత ఏడాది మార్చిలో ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఓ పెద్దపులి నాలుగు ఆడ పులికూనలకు జన్మనిచ్చింది. అయితే తల్లిపులి నుంచి పులికూనలు దూరమైనప్పటికీ ఒకే ఈతలో ఏకంగా నాలుగు పులికూనలకు జన్మనివ్వడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. తల్లి నుంచి దూరమైన పులికూనలు ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జూపార్క్‌లో ఉన్నాయి. వాటిలో ఒక పులికూన మరణించగా మిగినవి సురక్షితంగా ఉన్నాయి. రెండేళ్ల తర్వాత వాటిని తిరిగి నల్లమల అడవిలోనే వదిలేస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న పులుల అంచనాలను పరిశీలిస్తే..

సంవత్సరం	పెద్దపులుల సంఖ్య
1972	- 1827
1979	- 3015
1984	- 4005
1989	- 4334
1993	- 3750
1997	- 3508
2001-02	- 3642
2005	- 2000
2008	- 1411
2010	- 1706
2014	- 2226
2018	- 2967
2022	- 3167



పెద్దపులుల సంతాన ప్రక్రియ

సాధారణంగా నవంబరు, ఏప్రిల్ మధ్య వీటి పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుందని జంతుపరిశోధకులు నిర్ధారించారు. ఆడపులి కలయిక కొన్ని రోజులు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత సమయంలో జతకూటడం తరుచుగా జరుగుతుంది. గర్భాధారణ సమయం 16 వారాలు ఉంటుంది. ఒక ఈతలో సుమారు కిలో గల 2 నుంచి 4 కూనలకు జన్మనిస్తాయి. ఇవి గుడ్డిగా, నిస్సహాయంగా జన్మిస్తాయి. దట్టమైన ప్రాంతాలు, రాతిపగుళ్ల వంటి ప్రాంతాల్లో వాటిని ఉంచి ఆడపులులు ఆహార సేకరణకు వెళ్తాయి. పూర్తిస్థాయి పులికూనల సంరక్షణ ఆడపులుల పెంపకంలోనే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మగపులులు ఆడపులులతో జతకూడటం కోసం పులి కూనలను చంపివేస్తాయి. ముందు ఈతలో కూనలు చనిపోయినట్లయితే ఆడపులి తరువాతి ఈతకు ఐదు నెలలోపు సిద్ధమవుతుంది. మరణాల రేటు పులులలో చాలా అధికంగా ఉంటుంది. సగం కంటే ఎక్కువ పులులు రెండు సంవత్సరాల కంటే ఎక్కువగా బతకలేవు.

పర్యావరణ పరిరక్షణలో పెద్దపులే కీలకం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులే ప్రధాన భూమిక పోషిస్తోంది. ఎక్కడైతే పెద్దపులుల ఆవాసం అధికంగా ఉంటుందో ఆ ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. ఈ విషయాన్ని గుర్తించే ప్రపంచ దేశాలన్ని పెద్దపులి సంరక్షణ కోసం కసరత్తు సాగిస్తున్నాయి. ప్రతిఏటా జూలై 29వ తేదీన వరల్డ్ టైగర్స్ డే సందర్భంగా వివిధ రూపాల్లో పులుల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియపరుస్తున్నాం. ఇందులో ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోని ఆయా రేంజ్‌ల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించి అవగాహన కల్పించాం. సోమవారం జరిగే టైగర్ డే రోజున విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయడంతోపాటు పులుల సంరక్షణపై అవగాహన కల్పించనున్నాం.

వి.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్,
ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్



నల్లమలలో దొరికి ప్రస్తుతం తిరుపతి జూపార్క్‌లో ఉన్న పులికూనలు (ఫైల్)

ఎన్ఎస్‌టీఆర్‌లో 80కి పైగా పెద్ద పులులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల్లో పులుల సంతతి ఆశాజనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి 2022 పెద్దపులుల జాతీయ గణాంకాల ప్రకారం నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో 74 పులులు ఉన్నట్లు అంచనా వేశారు. అదేవిధంగా ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఫేస్-4 కింద నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో అత్యాధునిక డిజిటల్ కెమెరాల ద్వారా పులుల గణాంకాల ప్రక్రియ చేపట్టారు. ఇందులో మొత్తం 1135 లోకేషన్లను గుర్తించి ఒక్కో చోట ఒకజత ఇన్‌ఫారెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి సుమారు 3 లక్షల ఫొటోలను సేకరించారు. వాటిని సున్నిపెంటలోని జీవవైవిధ్య కేంద్రంలో బయాలజిస్టులను పరిశోధించి చివరకు మూడు వేల ఫొటోలను ఎంపిక చేశారు. వాటిని కూడా పూర్తి స్థాయిలో పరిశీలించి ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో 80కి పైగా పెద్దపులులు ఉన్నట్లు గుర్తించారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, జూలై 28: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. నంద్యాలను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే ఎస్పీ ఆదేశాల మేరకు పాత నేరస్థులు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు, డోన్ తదితర అన్ని సబ్ డివిజన్లలో ఈ కార్యక్రమం కొనసాగింది. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే 17 మంది రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. ఎవరైనా సత్ప్రవర్తన మార్చుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీస్ శాఖ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.

ఆధార్ లేని చెంచులు

- అడ్డంకిగా జనన ధ్రువీకరణ
- పింఛన్‌కు నోచుకోని దివ్యాంగులు

పాణ్యం, జూలై 28 : చెంచుల ఆధార్‌కు జనన ధ్రువీకరణ అడ్డంకి గా మారింది. దీంతో అధిక శాతం చెంచులు ఆధార్ నమోదు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 27న స్థానిక ఇందిరానగర్‌లో ఆధార్ నమోదు క్యాంపు చేశారు. అయితే దాదాపు పది మంది చెంచు వికలాంగులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్ కార్డు కోసం నమోదు చేసుకోలేని ఈ పరిస్థితి ఏర్పడింది. గతంలో తహసీల్దారు జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారిని విచారించి ధ్రువపత్రాలు మంజూరు చేశారు. వాటి ఆధారంగా ఆధార్ నమోదు చేసేవారు. ప్రస్తుతం తహసీల్దారు ఇచ్చే ధ్రువీకరణ పత్రం ఆధార్‌కు అనుసంధానం కాకపోవడంతో చెంచులు ఆధార్ కార్డు పొందలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా వికలాంగులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇదిలాఉంటే గతంలో ఆధార్ నమోదు చేసుకున్న చెంచుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. వీరికి మళ్లీ ఆధార్ నమోదు చేయాలంటే ఢిల్లీలోని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. చెంచుల ఆధార్ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు.




జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్ నమోదు కాని చెంచు పిల్లలు

నేడు నీటి పారుదల సలహా మండలి సమావేశం

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: కలెక్టరేట్‌లోని సెంటినరి హాలులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం తెలిపారు. ఖరీఫ్ 2024-25 ఏడాది ఖరీఫ్ పంటల నీటి విడుదలకు సంబంధించి సమావేశంలో చర్చిస్తారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు, తెలుగుగంగ ఆయకట్టు, ఎస్సార్బీసీ కేసీ కాలువ, వరద రాజస్వామి ప్రాజెక్ట్ ఆయకట్టు, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, హంద్రీనీవా, సుజల స్రవంతి పథకం చిన్న నీటి వనరులు, ఏపీఎస్ హైడీసీ ఆయకట్టు తదితర అజెండా అంశాలపై సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల




పోతిరెడ్డిపాడు నుంచి గేట్ల ద్వారా దిగువకు పోతున్న జలాలు

జూపాడుబంగ్లా/వెలుగోడు, జూలై 28: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం అరుగేట్ల నుంచి 10వేల క్యూసెక్కులు విడుదల చేయగా, ఆదివారం శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతం జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి భారీగా ఇన్‌ఫ్లో రావడంతో సాయంత్రం 18వేల క్యూసెక్కులకు పెంచి నీటిని కాలువలకు విడుదల చేశారు. ఆ నీటిని బానకచర్ల నీటిసముదాయం నుంచి తెలుగుగంగకు 10వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ 3వేల క్యూసెక్కులు, గాలేరునగరి కాల్వకు 5వేల క్యూసెక్కుల చొప్పున మళ్లించినట్లు అధికారులు తెలిపారు. వెలుగోడు జలాశయం పూర్తిసామర్థ్యం 16.95 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.359 టీఎంసీలకు నీరు చేరుకుందని తెలుగుగంగ ఏఈ శివానాయక్ తెలిపారు.

నిండుకుండలా శ్రీశైలం

- నేడు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తివేత
- 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆరు గేట్లు తెరిచే అవకాశం


శ్రీశైలం, జూలై 28: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తేందుకు జలవనరులశాఖ ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొంటారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను 873.40 అడుగులుగా నమోదైంది. అదేవిధంగా నీటి నిల్వ 215.807 టీఎంసీలకుగాను ప్రస్తుతం 156.3860 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 61,111 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జలాశయం గేట్లు తెరవలేదు. ఈ ఏడాది ఊహించని విధంగా వరద రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు కళకళలాడుతోంది.



శ్రీశైలం జలాశయంలోకి చేరుతున్న వరద

పది రోజుల్లోనే భారీగా చేరిన వరద

పదిరోజులుగా శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ జలాశయాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరిగింది. దీంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారడంతో మంగళవారం జలాశయం క్రస్టుగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జలాశయం గేట్లు తెరవలేదు. ఈ ఏడాది ఊహించని విధంగా వరద రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు కళకళలాడుతోంది.



జలాశయంలో 873.40 అడుగులకు చేరిన వరద



శ్రీశైలం జలాశయం

శ్రావణ మాస ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జూలై 28: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పరిపాలనా కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈవో మాట్లాడుతూ శ్రావణ మాసోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా భక్తులకు వసతి, దర్శనం, ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ, పారిశుధ్యం తదిత ఏర్పాట్లపై శ్రద్ధ కనబరచాలన్నారు. సమావేశంలో ప్రధానార్చకులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన సదస్సు

కర్నూలు, జూలై 28: నూతన చట్టాలపై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోలీసులకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎష్), భారతీయ సాక్ష్యా అధినీయం (బీఎస్ఏ) కొత్త, పాత చట్టాల్లో మార్పులు, చేర్పులపై డీఎస్పీ జే బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ టి.అబ్దుల్ గౌస్, మహిళా ఎస్ఐలు కలిసి అవగాహన కల్పించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి.. ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి.. చార్జిషీట్ ఎలా తయారు చేయాలి.. దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి.. అనే తెలుస్తాయని అన్నారు. నూతన సెక్షన్‌ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని మహిళా పీఎస్ పోలీసు అధికారులు మహిలా పోలీసులకు తెలిపారు.

ఏసీఎల్ఎస్ శిక్షణ తప్పనిసరి



శిక్షణ పొందిన మూడో బ్యాచ్ పీజీ వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూలై 28: నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు పీజీ చేసిన వైద్యులు తప్పనిసరిగా అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్టు (ఏసీఎల్ఎస్) శిక్షణను ఎన్ఎంసీ తప్పనిసరిగా చేసిందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యార్థుల ఏసీఎల్ఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కళాశాలలో 130 మంది పీజీలు, 9 మంది సూపర్ స్పెషాలిటీ పీజీలు ఉన్నాయని, వీరికి మూడు బ్యాచ్‌లో ఏసీఎల్ఎస్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు డా.మహేశ్వరరెడ్డి, జీజీహెచ్‌కు చెందిన డా.శ్రీలత, డా.రాధిక, డా.గోపినాథ్, డా.మహాలింగం, అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల, ప్రొఫెసర్ డా.కొండారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

వైద్య సదస్సులను సద్వినియోగం చేసుకోండి



జోనల్ సీఏఈని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూలై 28: వైద్య విజ్ఞాన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చర్ గ్యాలరీలో జనరల్ మెడిసిన్ జోనల్ సీఎంఈని వారు ఆదోని మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డా.డి.శ్రీరాములు, అబ్జర్వర్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామశివ నాయక్, మెడిసిన్ హెచ్‌వోడీ డా.కేఎం ఇక్బాల్ హుశేన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ జోనల్ సీఎంఈ వల్ల వైద్య విజ్ఞానంపై అవగాహన పెరుగుతుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ, విశ్వభారతి మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్విమ్ తిరుపతి మెడికల్ కాలేజీ మెడిసిన్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ రిసెర్చ్ మెథడాలజీ, పబ్లికేషన్స్ ఇన్ మెడిసిన్‌పై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. న్యూరాలజీ హెచ్‌వోడీ డా.సి.శ్రీనివాసులు, అప్రోజ్ టు ఎన్ఎంవో స్పెక్ట్రమ్ డిజార్డర్స్‌పై ఉపన్యాసం ఆకట్టుకుంది. గర్భిణుల్లో లివర్ డిసీజ్‌పై గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డా.జి.మోహన్ రెడ్డి, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ మెడిసిన్ ప్రొఫెసర్, అప్రోచ్ టు కాన్‌జెంటల్ హార్ట్ డిసీజ్ ఇన్ ఆర్డర్స్‌పై ఉపన్యసించారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ప్రాధాన్యత ఏదీ..?

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం

కర్నూలు(కల్చరల్), జూలై 28: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం ముందు ధర్నా చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కాపీలను తగులబెట్టారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత చేస్తామని లేదా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని పేర్కొనలేదని విమర్శించారు. రైతులకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తామని గానీ, రైతుల ఆత్మహత్యలను అరికట్టే విధంగా వ్యవహరిస్తామని, రైతులకు సబ్సిడీలు ఇస్తామనే గట్టి హామీ కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదని తెలిపారు రైతులు వ్యవసాయానికి పెట్టుబడి సహాయం కింద ఒక రైతుకు ఒక ఎకరా కింద రూ.20వేలు ఇవ్వాలని పదేపదే డిమాండ్ చేస్తున్నా ఆ ప్రస్తావన కూడా లేదని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామనే ప్రక్రియను ఉపసంహరించుకోలేదని, రసాయనిక ఎరువుల ధరలు తగ్గింపు హామీలు ఎక్కడా లేవని అన్నారు. ఇది పూర్తిగా పెట్టుబడిదారులకు అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా రైతాంగం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరేష్, రామాంజినేయులు, సురేంద్ర యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

గురు రాఘవేంద్ర పంప్‌హౌస్‌లో విధ్వంసం

- కీలక పరికరాలను ధ్వంసం చేసిన దుండగులు
- మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



జీఆర్‌పీ మాధవరం పంప్ హౌస్



ధ్వంసమైన స్టార్టర్లు

మంత్రాలయం, జూలై 28: మంత్రాలయం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి గ్రామ సరిహద్దుల్లో తుంగభద్ర నది ఒడ్డున గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో కీలక పరికరాలు ధ్వంసమయ్యాయి. మాధవరం పంప్ హౌస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. అందులో ఉన్న రైతులకు సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్న బ్రేకర్లు, స్టాటర్లు, ఇన్సులేటర్లు తొలగించి, సుత్తిలతో పగులకొట్టారు. ఏమైనా దోచుకెళ్లారంటే అది లేదు.. కసితో, పగతో, కుట్రతో రైతులకు సాగునీరు అందకూడదన్న దురుద్దేశంతోనే ఈ ఘతుకానికి పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ ధ్వంసంపై ఏఈ హరిప్రసాద్ మాధవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2005లో పంప్‌హౌస్ పనులు ప్రారంభించారు. 2013లో పనులు పూర్తి చేసి 2016-2021 వరకు సంబంధిత కాంట్రాక్టర్లే మెయిటెన్స్ చేస్తూ సాగునీరు అందించారు. అయితే 2019 నుంచి వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వకపోవడంతో జీఆర్‌పీకి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ఏడాది ముందస్తుగా తుంగభద్ర నదికి నీరు విడుదల విషయం తెలుసుకున్న జీఆర్‌పీ ఈఈ భాస్కర్ రెడ్డి, డీఈ కృపానిధి, ఏఈ హరిప్రసాద్, లస్కర్లు రాంబాబు, రమేష్‌లు ఈ నెల 24వ తేదీన మాధవరం పంప్ హౌస్ స్టేజ్-1ను పరిశీలించారు. ఆదివారం బెళగల్, రచ్చుమర్రి, మాధివరం చెందిన 20 మంది రైతులు పంప్ హౌస్ వద్దకు వెళ్లి నీటిని విడుదల చేసేందుకు ప్రధాన డోర్‌ను తెరిచారు. అయితే అప్పటికే వెనుకడోర్ తెరిచి ఉండటం, హెచ్‌పీ ప్యానెల్, ఎల్‌టీ ప్యానెళ్లు చెల్లాచెదురుగా పడి ఉండటం గమనించి జీఆర్‌పీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో 6.6 కేవీ మూడు బ్రేకర్లు, 33 కేవీమూడు బ్రేకర్లు, రెండు స్టాటర్లు, మూడు ఇన్సులేటర్లలో ఉన్న 9 పీటీలను గుర్తు తెలియని వ్యక్తులు సుత్తితో ధ్వంసం చేశారు. 4,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 885 హెచ్‌పీ రెండు మోటార్లు, బెళగల్ వద్ద 7.30 కిలోమీటర్ల పైపులైన్ వేసి బెలగల్ రిజర్వాయరుకు 50 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం గల రిజర్వాయరును పూర్తి చేశారు. అందులోకి నీరు పంపింగ్ చేసి అక్కడి నుంచి రైతులకు బెళగల్ రిజర్వాయరు పంప్‌హౌస్ స్టేజ్-2 నుంచి తాగునీరు అందించాలి. ధ్వంసమైన పరికరాల విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఐదేళ్లలో ఈ పంప్‌హౌస్ మరమ్మతులకు గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.20 లక్షలను విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఇలాంటి ఘటన జరగడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దొంగలైతే వీటిని అమ్మి సొమ్ము చేసుకునే వారనీ, టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదన్న దురుద్దేశంతో ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

22 బైకులు, ఆటో స్వాధీనం

కర్నూలు, జూలై 28: ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో శరీన్ నగర్, ఆదోనిలో అరుణ్ జ్యోతి నగర్‌లలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడులలో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడులలో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఫోర్త్ టౌన్ సీఐ శంకరయ్య, కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, సెబ్ పోలీసులు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, జావేద్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, వంద మంది పోలీసులు పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని సబ్ డివిజన్‌లో: ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో ఆదోని త్రీటౌన్ పరిధిలోని అరుణ్ జ్యోతి నగర్‌లో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒకరిని అదుపులోకి తీసుకుని 253 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు వీటి విలువ (రూ.22వేలు), ఎలాంటి ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆదోని పట్టణ సీఐలు తేజమూర్తి, గోపి, నరసింహరాజు, తాలుకా సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

11న బలిజ సంఘం ఎన్నికలు

కర్నూలు(కల్చరల్), జూలై 28: ఆగస్టు 11వ తేదీ ఉదయం 11 గంటలకు కర్నూలు జిల్లా, నగర బలిజ సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్గా రామకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని బలిజ సంఘీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదని, అందువల్ల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పదవులు కార్పొరేషన్లలో, మార్కెట్ యార్డు కమిటీల్లో బలిజ సంఘీయులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సంఘానికి తగిన గుర్తింపు ఉందన్నారు. బలిజ సంఘం నాయకుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసులు, సురేష్, గాండ్ల లక్ష్మన్న, గాజుల సతీష్, అమర్‌నాథ్, శైలేష్, సహదేవుడు, సుజాత, బ్రాహ్మణి దేవి, ఐకాన్ రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జూలై 28: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగాధిపతి డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. జనవరిలో జరిగిన పరీక్షలకు 2913 మంది దరఖాస్తు చేసుకుని పరీక్షలు రాయగా, 851 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాజునాయక్(ఫైల్)

గడివేముల, జూలై 28: వసతి గృహంలో చదువుతున్న కొడుకును చూసి తిరిగి ఇంటికి వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన గడివేముల మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ఎల్‌కే తండకు చెందిన రాజునాయక్ (37), సావిత్రిబాయికి నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం. కొడుకు శివశంకర్‌నాయక్ పాణ్యం మండలంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం కొడుకును చూసేందుకు రాజు నాయక్, అతడి భార్య సావిత్రిబాయి దిచక్రవాహనంపై పాణ్యం వెళ్లారు. కొడుకును చూసి బాగా చదువుకోవాలని చెప్పి తిరిగి తమ స్వగ్రామానికి వారు బయల్దేరారు. మార్గమధ్యంలో రాజునాయక్ ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో రాజునాయక్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఇదిలా ఉండగా రాజునాయక్ మొదటి కుమార్తె వివాహం మరో రెండు వారాల్లో జరగాల్సి ఉంది. శుభకార్యం జరగాల్సిన కుటుంబంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలంలో రాజునాయక్ భార్య, బిడ్డలు రోధించిన తీరు కలిచివేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. బాధితుల నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

ఆదోని, జూలై 28: రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఆదోని మండలం కుప్పగల్లు-కోసిగి రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగిందని ఎస్సై గోపాల్ తెలిపారు. మృతి చెందిన యువకుడు మంత్రాలయం మండలం తుంగభద్రకు చెందిన విజయ్ (15)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు

కర్నూలు(అర్బన్), జూలై 28: కర్నూలు నగరంలోని బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఆదివారం సెబ్ పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా నగరంలోని పలు కాలనీలో విస్తృత దాడులు చేశారు. బంగారుపేట నాటుసారా స్థావరాలపై దాడి చేసి 1900 లీటర్ల నాటుసారా, తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. బంగారుపేటకు చెందిన షికారి మాధవి నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో టూటౌన్ సీఐ ఇంతియాజ్, ట్రైనీ ఏఈఎస్ హర్ష, ఎస్ఐలు మారుతి, రెహానాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వైద్య సదస్సు

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: ఈఎన్టీ వైద్యుడు డాక్టర్ మధుసూదనరావు ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న 34వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం, రెండు రోజులపాటు జరిగిన ఈఎన్టీ వైద్యుల రాష్ట్ర సదస్సు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 110 మందికి శస్త్ర చికిత్స, వెయ్యి మందికి పైగా ఉచితంగా వైద్య సేవలు అందించారు. రూ.50 లక్షల విలువైన వైద్యసేవలు నిరుపేదలకు అందించారు. కార్యక్రమంలో ఈఎన్టీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ దీపక్, డాక్టర్ వినయ్ విజయేంద్ర, రవికృష్ణ డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్‌లు పాల్గొన్నారు.

ఇదో రకం దందా..!

- ఒక్కో కార్మికుని నుంచి రూ.10 వేలు
- నగర పాలక సంస్థలో అధికారులు, యూనియన్ నాయకుల ఇష్టారాజ్యం
- జీతాలు పెంచింది తామేనని రూ.20 లక్షలు వసూలు
- లబోదిబోమంటున్న కార్మికులు



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కర్నూలు(న్యూసిటీ), జూలై 28: నగర పాలక సంస్థ పరిధిలోని మరుగుదొడ్ల కార్మికులు, డ్రైవర్ల నుంచి అధికారులు, యూనియన్ నాయకులు వసూళ్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం కార్మికులకు రూ.6 వేలు, డ్రైవర్లకు రూ.3500 జీతాలు పెంచింది. దీనికి తామే కారణమని, దగ్గరుండి తామే జీతాలు పెంచామని యూనియన్ నాయకులు అంటున్నారు. అది కాదు.. తమ వల్లనే జీతాలు పెరిగాయని కొందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దోచుకుంటున్నారు. ఓ యూనియన్ నాయకులైతే ఏకంగా కార్మికులు డబ్బులు ఇవ్వకపోతే వారి నుంచి రూ.20 నుంచి రూ.30 వేలు అప్పు తీసుకున్నట్లు బాండ్ పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తున్నది.

నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులకు 16 డివిజన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. గత ప్రభుత్వం 95 మంది పబ్లిక్ హెల్త్ కేర్ టేకర్స్‌కు, 58 మంది డ్రైవర్లకు జీతాలు పెంచింది. దీంతో కార్మికుల మీద గద్దల్లా యూనియన్ నాయకులు, అధికారులు వాలిపోయారు. బలవతంగా వసూళ్లు చేస్తున్నారు. ఇదంతా గత రెండు నెలల నుంచి జరుగుతోంది. తాము ఒక్కరమే ఈ డబ్బులు తీసుకోవడం లేదని..ఇందులో కొంత కార్యాలయంలో అధికారులు..ఉద్యోగులకు కూడ ఇవ్వాలని యూనియన్ నాయకులు కార్మికులతో చెప్పారు. డబ్బులు ఇవ్వమని కొందరు కార్మికులు మొండికేస్తే... అధికారులతో చెప్పి అలాంటి వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామనే బెదిరిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఈ విషయం గతంలోనే కార్యాలయంలోని ఉన్నతాధికారి దృష్టికి కార్మికులు తీసుకెళ్లారు. ఆయన యూనియన్ నాయకులను పిలిపించి- కార్మికుల నుంచి డబ్బు వసూళ్లు చేసుకోడానికి తమ పేరును వాడుకోవద్దని, మధ్యలో అధికారులను ఎందుకు ఇరికిస్తారని హెచ్చరించి పంపించారు. ఇదే తడవుగా యూనియన్ నాయకులు మరో అడుగు ముందుకేసి డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కార్మికుల నుంచి డబ్బుల వసూలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వసూలు చేసి ఇస్తే అందులో కొంత మొత్తం మీకు ఇస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు చెప్పారు. దీంతో వారు కూడా కార్మికుల నుంచి బలవంతంగా వసూలు చేశారు.

అధికారుల వంతు వచ్చింది....

యూనియన్ నాయకులు అడిగిన వెంటనే కార్మికులు డబ్బులు ఇస్తుండటంతో కొందరు అధికారులకు కూడా ఆశ పుట్టింది. వీరు కూడ శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మధ్యలో పెట్టి డబ్బులు వసూలు చేయించారు. ఇవ్వని కార్మికులు విధులకు హాజరు కానట్లు చూపించాలని ఒత్తిడి చేశారు. దీంతో కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చేసేదేమీ లేక..అధికారుల ఆదేశాలు పాటించి కార్మికుల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడ్డారు. ఇవ్వనివారిని మానసికంగా వేధించారు. యూనియన్ నాయకులు వసూళ్లకు పాల్పడితే అధికారులకు చెప్పుకున్నాము... కార్యాలయ అధికారులే బలవంతంగా వసూళ్లకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలని కార్మికులు, డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. యూనియన్ నాయకులు, అధికారులు కలిసి సుమారు రూ.20 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

కార్మికులు, డ్రైవర్ల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే విషయం మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. రెండు నెలల క్రితం యూనియన్ నాయకులు వసూలు చేస్తున్నారని కొందరు కార్మికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను. అప్పుడే కమిషనర్ హెచ్చరించారు. మాకు తెలియకుండా యూనియన్ నాయకులు వసూలు చేస్తున్నారు.

- కే.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ

చంద్రబాబును కలిసిన నరసింహారావు


ఢిల్లీలో సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు ఢిల్లీలో కలిశారు. ఏపీ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు నాయుడును నరసింహారావు కలిశారు. గడిచిన ఎన్నికల్లో పెనుగొండ, ఆళ్ళగడ్డ, నంద్యాల నియోజక వర్గంలో టీడీపీ విజయం కోసం కృషి చేసిన నరసింహారావును చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రిని కలిసిన కొత్తూరు ఆలయ సిబ్బంది


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

పాణ్యం, జూలై 28: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఆలయ ఈవో రామకృష్ణ తీసుకెళ్లారు. ఆదివారం ఈవో ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిధిలో జరిగే మహా ప్రాకార, క్యూలైన్ పనులను వివరించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎంపీపీ

గడివేముల, జూలై 28: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను ఆదివారం గడివేముల మాజీ ఎంపీపీ పద్మావతమ్మ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే గౌరుచరిత మండలంలోని సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

నేడు ఎస్సార్బీసీకి నీటి విడుదల

పాణ్యం, జూలై 28: ఎస్సార్బీసీకి సోమవారం నీటిని విడుదల చేస్తున్నట్లు గోరుకల్లు ఈఈ శుభకుమార్ తెలిపారు. రెగ్యులేటర్ల ద్వారా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, సీఈ కబీర్, ఎస్సార్బీసీ సిబ్బంది ఈ నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి 10 టీఎంసీలు నిల్వ ఉంచడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ ఓటి రెగ్యులేటర్‌లో కుంగిన రతిపరుపు పనులు ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పూర్తయ్యాయన్నారు.

'నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్'

నంద్యాల క్రైం, జూలై 28: నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులు జరగాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పోలీస్ అధికారులు మట్కా, జూదం, మద్యం అక్రమ రవాణా, ఇసుక, డంకెన్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ ఆక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయంతో డంకెన్ డ్రైవ్ చేపట్టి మొత్తం 14కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 92 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తూ 285 కేసులు నమోదు చేసి రూ.1,10,750 జరిమానా విధించినట్లు తెలిపారు. శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో ఊరిబయట పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, ఎస్ఐ సురేష్ సిబ్బంది దాడి చేసి 17మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 23,400 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమ మద్యంపై దాడులు చేసి 8 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 7డీపీఎల్ కేసుల్లో 45.10లీటర్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒక నాటుసారా కేసు నమోదు చేసి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 800లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి 4 వాహనాలను సీజ్ చేసి 39.05 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

'యువతను విస్మరించిన కేంద్రం'

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును విస్మరించి కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు విమర్శించారు. నంద్యాలలో జరుగుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు రెండో రోజుకు చేరాయి. డీవైఎఫ్ఐ అనుబంధ సంస్థల రాష్ట్ర నాయకులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర, జిల్లా నాయకులు వివిధ నియోజకవర్గాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విచారణ

జూపాడుబంగ్లా, జూలై 28: మండలంలోని తాటిపాడు, జూపాడు బంగ్లా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని ఈనెల 22న జరిగిన బహిరంగ చర్చ వేదికలో ఫిర్యాదు చేశారని, దీంతో మంగళవారం విచారణ ఉందని ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. సంబంధిత సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు విచారణ అధికారులకు అందుబాటులో ఉండి సహకరించాలని ఆమె తెలిపారు.

ఆనందంలో రైతులు

● వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుకుంటున్న నీరు


వీబీఆర్‌లోకి పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలు


బండిఆత్మకూరు వద్ద వరి నార్లు పోసిన రైతులు

బండిఆత్మకూరు, జూలై 28: శ్రీశైలం బ్యాక్ వాటర్ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పరవళ్ళతో చేరుకుంటోంది. బండిఆత్మకూరు మండలంలోని కేసీ కెనాల్, తెలుగుగంగ కింది రైతులు ఇక ఖరీఫ్, రబీ పంటల సాగుకు ఎలాంటి ఢోకా లేదని దీమా వ్యక్తం చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు, వీబీఆర్‌లను రైతులు స్వయంగా వెళ్లి సందర్శించి అక్కడ గంగమ్మకు పూజలు నిర్వహించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలతో కృష్ణమ్మ వడిలోని అల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు త్వరగా నిండి, దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతుండటం రైతుల్లో మరింత ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి.

నీటి విడుదలతో పంటలకు భయం లేదు



కృష్ణమ్మ తల్లి తక్కువ కాలంలోనే వెలుగోడు రిజర్వాయర్‌కు చేరటం ఆనందంగా ఉంది. వీబీఆర్ కింద ఉన్న ఆయకట్టు పొలాల్లో పంట సాగుకు ఎలాంటి భయం లేకుండా పోయింది. గంగ కింద నారుమడులు పోసుకునేందుకు త్వరగా వీబీఆర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలి.

\- నాగరాజు, రైతు, పెద్దదేవళాపురం

నంద్యాలలో మరో ఎస్ఎస్ ట్యాంకు

మంత్రి ఎన్ఎండీ ఫరూక్


ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: నంద్యాల పట్టణ ప్రజల శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి అతి పెద్ద సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఇంజినీర్లతో కలిసి రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ. ఫరూక్ పట్టణ శివార్లలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ప్రతిపాదన స్థలాన్ని పరిశీలించారు. ఫరూక్ మాట్లాడుతూ.. నంద్యాలలో గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు చెరువు కట్ట పక్కనే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించినట్లు తెలిపారు. 20 ఏళ్ల తర్వాత ప్రజల ఆశీస్సులతో తాను మళ్లీ మంత్రి అయ్యాయని అన్నారు. పట్టణ జనాభా పెరుగుదల కారణంగా తాగునీటి సమస్య ఏర్పడటంతో దాన్ని శాశ్వతంగా నివారించేందుకు జనాభా ప్రకారం అతి పెద్ద సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారమన్నారు. ట్యాంకు నిర్మాణంతో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈ మేరకు ప్రతి పాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

'విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రాజగోపాల్, సుబ్బరాయుడులు కోరారు. ఆదివారం టీడీపీ కార్యాలవ ఆవరణంలో సంఘం నాయకులు విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు హర్షం వ్యక్తం చేశారు.

'సంక్షేమబోర్డును పురుద్ధరించాలి'

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నంద్యాల ఎలక్ట్రీషియన్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు రఫి, టిడిపి వాణిజ్య విభాగం కడప ఉపాధ్యక్షుడు సుదర్శన్ కోరారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. నిర్మాణ రంగాలకు సంబంధించి కార్మికులకు వివిద రకాలుగా అందాల్సిన సంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే


బానకచెర్ల క్రాస్ హెడ్‌రెగ్యులేటర్ వద్ద కృష్ణానది జలాలకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, జూలై 28: కృష్ణానది జలాలకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ, పసుపు, పూలు, చీర సారె నదీమ తల్లికి సమర్పించారు. మండలంలోని బానకచెర్ల క్రాస్‌హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం గోరుకల్లు, ఎస్సార్బీసీకి 5వేల క్యూసెక్కుల నీటిని స్విచ్ ఆన్ చేసి నీటిని దిగువకు వదిలారు. ఈ ఏడాది చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురువడంతో నదులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయని, రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది నీరు పుష్కలంగా ఉండటంతో రెండుకార్లు పంటలు పండించవచ్చన్నారు. రైతులకు అన్ని విధలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గత వైసీపీ పాలనలో ప్రాజెక్టుల గేట్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టులు కొట్టుకపోయాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగం, అప్పులు, దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. నందికొట్కూరు నియోజక వర్గంలో ఎనిమిది లిఫ్టులు ఉన్నాయని, వాటి ద్వారా ప్రతి ఎకరాకు నీళ్ళందించే బాధ్యత తీసుకొంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సార్బీసీ అధికారులు డీఈఈ రమణ, డీఈ గోపాల్‌నాయక్, ఈఈ వేణుగోపాల్, జేఈలు, టీడీపీ నాయకులు సురేంద్రనాద్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, గోవిందు, హరినాథరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

'మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి'

చేపలవేట జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారుల సమస్యలు తీర్చడానికి తనవంతు తప్పక కృషి చేస్తానని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎంఎల్ఏకు మత్సకారులు గత ఐదు సంవత్సారాలుగా ఎలాంటి పథకాలు అందడం లేదని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వలలు, బోట్లు తదితర సామగ్రిని, వివిధ రకాల పథకాలను అర్హులైన ప్రతి ఒక్క మత్స్యకారునికి టీడీపీ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాలలోని నందమూరి నగర్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా బీచ్ కబడ్డి పురుషులు, మహిళల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గౌరవ అధ్యక్షుడు సుధాకర్, చలంబాబు, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో ప్రతి భకనబర్చిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని, ఎంపికైన జట్లు ఆగస్టు నెల 2,3,4 తేదీలలో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో ప్రాతనిధ్యం వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో మున్నా, మోహన్, భరత్‌రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలన్నింటినీ హరించే విదంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ప్రజా వ్యతిరేక మూడు క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వారి సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీజడ్ మియా, రంగనాయకులు, మౌళాలి, బడేనవాజ్, వలి, జాన్సన్ పాల్గొన్నారు.

'రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలి'

ఆత్మకూరు, జూలై 28: ఆంధ్రరాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో అధికారంలోకి రాకముందు బీజేపీ ప్రభుత్వం ఏపీకి 15ఏళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పి ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశాలను పట్టుపట్టి సాధించుకోవాలని సూచించారు. అదేవిధంగా వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. నాయకులు మంజుల, స్వాములు, నాగేశ్వరరావు, సురేంద్ర, సద్దాంహుసేన్, దినేష్ తదితరులు ఉన్నారు.

మినీ ట్యాంకుల చుట్టూ అపరిశుభ్రత



పడమర నెహ్రూనగర్‌లో, తూర్పు నెహ్రూనగర్‌లో మినీ ట్యాంకుల చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న దృశ్యాలు

పగిడ్యాల, జూలై 28: వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజకుమారి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పగిడ్యాల ఈవోఆర్డీకి ఆదేశాలు జారీ చేశారు. అయినా గ్రామ పంచాయతీల కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కలుషితమైన నీటితో అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూనగర్ గ్రామ పంచాయతీలో మూడు ఓవరు హెడ్ ట్యాంకులు, 6 జీఎల్ఆర్ఎస్ ట్యాంకులు, 35 మినీ వాటరు ట్యాంకులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ట్యాంకులను శుభ్రం చేయించకపోవడంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. నెహ్రూనగర్-1 సచివాలయ సమీపంలో ఉన్న మినీ వాటర్ ట్యాంకు చుట్టూ నీరు వృథాగా ప్రవహించడంతో అపరిశుభ్రంగా మారింది. అలాగే ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో నీళ్ల పట్టుకునేందుకు ఇబ్బందిగా మారిందని ప్రజలు చెబుతున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకు చుట్టూ నీరు నిల్వడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నీటి ట్యాంక్‌లను నామమాత్రంగా శుభ్రం చేస్తూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారని, ట్యాంకులను శుభ్రం చేసిన తేది నమోదు చేయాలని ఆదేశాలు ఉనా ఎవరూ నమోదు చేయడం లేదు. ఈవోఆర్డీ నాగేంద్రమయ్యను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌ను వివరణ కోరగా ఇంకుడు గుంతల తీయడం కోసం ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

పరిహారం ఇవ్వాలి

● ఎమ్మెల్యేకు కందికాయపల్లె రైతుల వినతి


కందికాయపల్లె రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం, జూలై 28: కందికాయపల్లిలోని గ్రీన్‌కో ఏర్పాటు చేస్తున్న సోలార్ పరిశ్రమలో కోల్పోయిన ప్రభుత్వ భూములకు పరిహారం ఇవ్వాలని ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డికి రైతులు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో లేని ప్రభుత్వ భూములకు నష్టపరిహారం కింద రూ.5 లక్షలు ఇస్తామని గ్రీన్‌కో పరిశ్రమ ఏర్పాటు సమయంలో హామీ ఇచ్చిందని రైతులు తెలిపారు. ప్రస్తుతం సాగు చేసుకుంటున్న భూములను దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్లతో దున్ని పంటలు చెడగొట్టి ఆక్రమించి పరిహారం ఇవ్వబోమంటున్నారని వాపోయారు. తమకు పరిహారం ఇవ్వని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రీన్‌కో సంస్థతో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.

జర్నలిస్టు మృతికి ప్రముఖుల నివాళి

నందికొట్కూరు, జూలై 28: నందికొట్కూరు పట్టణంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టుగా కొనసాగుతున్న ఎస్.మహ్మద్ అలీ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికాయానికి నందికొట్కూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఫోన్‌లో ఆయన కుమారుడిని పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కూడా మహ్మద్ అలీ భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

'శాంతిభద్రతల పరిరక్షణకు ఫుట్ పెట్రోలింగ్'

నంద్యాల క్రైం, జూలై 28: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నంద్యాల పట్టణంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. దేవనగర్ వీసీకాలనీ, పద్మావతినగర్, ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కె, మార్కెట్‌యార్డు, గిరినాథ్ సెంటర్, ఎస్‌బీఐ కాలనీ టర్నింగ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో వారి సిబ్బందితో కాలినడకన గస్తీ నిర్వహించారు. ఈ ఫుట్ పెట్రోలింగ్ వల్ల బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నియంత్రించడం తోపాటు రహదారి ప్రమాదాల నివారణ, కొందరు షాప్‌ల యజమానులు దారికి అడ్డంగా వారికి సంబంధించిన వస్తువులు ఉంచి వచ్చిపోయే ప్రయాణికులకు ఆటంకం కలిగించకుండా చేయవచ్చన్నారు. అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచడంతోపాటు పోలీస్ అధికారులకు వారి సిబ్బందికి తమ పోలీస్ స్టేషన్ పరిధిపై పట్టు పెంచుకొని నేర నియంత్రణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. రహదారులలో మహిళలు, చిన్న పిల్లలపై పోకిరిగాళ్లు చేసే వెకిలి చేష్టలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడం, నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

పూర్వ విదార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు, జూలై 28: వెలుగోడు పట్టణంలోని నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాలలో 1985 నుంచి 1988 సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కళాశాలలో తరగతి గదుల్లో కలియ తిరిగి గత స్మృతులను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు గురువులు విద్యాబోధన చేయడంతోనే తాము పలు హోదాల్లో ఉన్నామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్ర మూర్తి, తెనాలి మున్సిపల్ కమిషనర్ శేషన్న, అంబాల ప్రభాకరరెడ్డి, సుబ్బలక్ష్మమ్మ, జయరామిరెడ్డి, రామలింగేశ్వర గౌడ్, శ్రీనివాసులు, పుల్లయ్య తదిరతులు పాల్గొన్నారు.

వైసీపీకి భారీ షాక్

● టీడీపీలో చేరిన జడ్పీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు


అల్లూరులో టీడీపీలో చేరిన రామలింగేశ్వరరెడ్డి

పాములపాడు, జూలై 28: మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. రోజురోజుకు టీడీపీలోకి చేరికల కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం జడ్పీటీసీ దంపతులు గండగారి జ్యోతి, రామలింగేశ్వరరెడ్డి దంపతులు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వైసీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అల్లూరులో టీడీపీలో చేరారు. మిగతా వారు తుమ్మలూరు గ్రామంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ ప్రముఖ నాయకులు మధుసూదన్. తుమ్మలూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ, ఇస్కాల, జూటూరు. తుమ్మలూరు, రుద్రవరం గ్రామాల సర్పంచులు, 12 మంది వార్డు మెంబర్లతో పాటు మండలంలోని మిట్టకందాల, చెలిమిళ్ళ, ఇస్కాల, రుద్రవరం తదితర గ్రామాల నుంచి దాదాపు రెండు వందల మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, జూలై 28: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆసీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

అలరించిన నిత్య కళారాధన


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 28: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం పల్నాడు జిల్లా, నరసరావుపేటకు చెందిన మాతృశివానంద కళాక్షేత్రం బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకౌత్వం, మూషికవాహన, అర్ధనారీశ్వరం, నాగేంద్రహారాయ, ఓం నమశ్శివాయా తదితర గీతాలకు కళాకారులు నృత్యాలను ప్రదర్శించారు.

గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ

చాగలమర్రి, జూలై 28: నియోజకవర్గ పరిధిలో గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, నాటుసార, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రత నియమాలు ఉల్లఘించిన వారికి జరిమానాలు విధించారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, ఏఎస్ఐ నబీసాహేబ్, పోలీసులు ఉన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, జూలై 28: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో ప్రజలకు భరోసా నింపిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు సూపర్-6 పథకాలు అమలు చేశారని అన్నారు. బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, సుబ్బరాయుడు, పీరయ్య, లాలయ్య, చిన్ని కృష్ణయ్య పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి



చాగలమర్రిలో సభ్యత్వ నమోదు చేస్తున్న జనసేన నాయకులు

చాగలమర్రి, జూలై 28: రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని చాగలమర్రి జనసేన నాయకులు కె.అబ్దుల్లా, సుబ్బయ్య తెలిపారు. ఆదివారం గ్రామంలోని పలు వీధుల్లో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు సుపరిపాలన అందిస్తారని అన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో హామీలు నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షబ్బీర్, లింగారెడ్డి, వినయ్, ప్రసాదురెడ్డి పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టులోకి వెళ్లొద్దు



అప్పనపల్లె గొర్రెల కాపర్లకు సూచనలు ఇస్తున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు శ్రీనివాసరెడ్డి

రుద్రవరం, జూలై 28: రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లోని రిజర్వు ఫారెస్టులోకి వెళ్లవద్దని సెక్షన్ ఆఫీసరు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రేంజ్ పరిధిలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లకు సూచించారు. గొర్రెలు, మేకలు పాడిగేదెలతో అడవిలోకి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని, అటవీ తీర పంట పొలాల్లో పని చేసుకుంటున్న రైతులకు సూచించారు. వన్యప్రాణులకు హానీ చేస్తే వైల్డ్‌లైఫ్ యాక్ట్ 1972 కింద కేసులు నమోదు చేస్తామన్నారు. అటవిలో వన్యప్రాణి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసరు సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసులు ఎన్నిక



నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల, జూలై 28 : కోవెలకుంట్లలో ఆదివారం రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా ఆర్.శ్రీనివాసులు, కార్యదర్శిగా కె.వెంకటరాముడులను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మాజీ రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శ్రీరామమూర్తి వీరిరువురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బీటెక్ చదువుతున్న పేద విద్యార్థి అయిన కె.నరేంద్రకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అసిస్టెంటు గవర్నర్ జి.రవికుమార్, మాలపాటి శేఖర్, వై.బాలాంజనేయరెడ్డి, పెండేకంటి సుబ్రహ్మణ్యం, శిల్పా సుబ్రమణ్యం, శేషారెడ్డి, సుబ్బయ్య, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

చాగలమర్రి, జూలై 28: మండలంలోని రాంపల్లె గ్రామంలో ఆదివారం జనసేన నాయకులు రామకృష్ణ, వెంకటరమణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, అధికార ప్రతినిధి సూర్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని అన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమా కూడా ప్రభుత్వం ద్వార అందజేయబడుతుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శెట్టివీడు పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సచివాలయం, ఆర్‌బీకే



శెట్టివీడులో పునాదుల్లోనే ఆర్‌బీకే

ఒకే గదిలో సచివాలయం, ఆర్‌బీకే

- పునాదులకే సచివాలయం, ఆర్‌బీకే పరిమితం
- ఐదేళ్లు గడిచినా సాగని పనులు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

చాగలమర్రి, జూలై 28: మండలంలోని శెట్టివీడు గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు లేక సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ, ఆర్‌బీకే భవన పనులు నేటికి పునాదులకే పరిమితమయ్యాయి. ఆర్‌బీకే భవనం లేక వ్యవసాయ సిబ్బంది అద్దె భవనంలో నిర్వహించారు. 6 నెలల నుంచి అద్దె బిల్లులు చెల్లించక పోవడంతో యజమాని తాళం వేయడంతో వ్యవసాయ సిబ్బంది పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయ భవనం పూర్తి కాకపోవడంతో 9 మంది ఉద్యోగులు టీడీపీ ప్రభుత్వ హాయంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయంలోనే సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో సచివాలయ ఉద్యోగులు, ఆర్‌బీకే సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ఆయా శాఖల ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌బీకే, సచివాలయ భవనాలు నిర్మించేందుకు పునాదులు తీసి పిల్లర్లకే పరిమితం చేశారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించలేక పోతున్నామని ఆయా శాఖల ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయం, ఆర్‌బీకే భవన పనులు పూర్తి చేసి సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

డోన్(రూరల్), జూలై 28: పట్టణంలోని ఎస్‌కేపీ హై స్కూల్ 1991-92 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 33 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి పాదాభివందనాలు చేశారు. పూర్వ విద్యార్థులు మహర్షి రమణ, నాయకంటి కిరణ్, నాగశంకర్, కిషోర్, కిషోర్, ప్రవీణ్, శివానంద, మదన్, సురేష్ తదితరులు నాటి ఉపాధ్యాయులు దత్తాత్రేయ శర్మ, సుబ్బరాయుడు, ప్రసాదరావు, బ్రహ్మం, కృష్ణమూర్తి, వీసీ ప్రసాద్‌లను సన్మానించి నాటి జ్ఞాపకాలను ఉపాధ్యాయులతో వారికున్న అనుబంధ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

తమ్మడపల్లెలో పెద్దమ్మకు పూజలు



పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , జూలై 28: మండలంలోని తమ్మడపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆదివారం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గుండ్రమద్దిలేటి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరటి రైతు గగ్గోలు

- మూడేళ్లుగా అందని సబ్సిడీ నిధులు
- అప్పులపాలైన రైతులు



ప్యాపిలి, జూలై 28: వైసీపీ ప్రభుత్వం అరటి రైతును దగా చేసింది. మూడేళ్లుగా రాయితీ నిధులు చెల్లించకపోవడంతో రైతులు అప్పులపాలై విలవిలలాడుతున్నారు. ప్యాపిలి మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు అరటిని సాగు చేస్తున్నారు. చంద్రపల్లి, గుడిపాడు, పెద్దపొయి, వెంకటకొండాపురం, నల్ల మేకలపల్లి, బోయవాండ్లపల్లి, రాంపురం, రాచవాండ్లపల్లి, హుసేనాపురం, పీఆర్‌పల్లి తదితర గ్రామాల్లో ఈ పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం రాయితీలు కల్పిస్తామని చెప్పడంతో రైతులు అప్పులు చేసి పంటను సాగు చేశారు. కొంతమంది రైతులు పొలాన్ని ఎకరా రూ. 30 వేల నుంచి రూ.40వేల వరకు కౌలుకు తీసుకొని అరటి సాగు చేశారు. అయితే మూడేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. కాస్తో కూస్తో పండిన పంట కూడా మార్కెట్లో గిట్టుబాటు ధరలు కొరవడ్డాయి. దీంతో అరటి రైతులు ఆర్థికంగా చితికిపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ వర్గీయుడిపై దాడి

ఆళ్లగడ్డ, జూలై 28: ఆళ్లగడ్డ మండలంలోని యాదవాడ గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు జాఫర్‌బాషా అనే వ్యక్తిపై ఆదివారం దాడి జరిగిందని రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నరసింహారెడ్డి మరో నలుగురు తనను కులం పేరుతో దూషిస్తూ కట్టెలతో దాడి చేశారని బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.

మంత్రి బీసీకి జ్ఞాపిక అందజేత



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని అభినందిస్తున్న ఆలయ ఈవో రామకృష్ణ

బనగానపల్లె, జూలై 28: బనగానపల్లెలోని టీడీపీ కార్యాలయంలో రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఈవో రామకృష్ణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని మంత్రికి అందించారు. ఆలయ అభివృద్ధిపై ఈవో మంత్రితో చర్చించారు.

ఆర్‌అండ్‌బీ రిటైర్డు ఏఈ మృతికి మంత్రి సంతాపం: రిటైర్డు ఆర్‌అండ్‌బీ డీఈ అలీబేగ్ (70) అనారోగ్యంతో మృతి చెందడంతో రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సోదరుడు బీసీ రాజారెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆదివారం ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి చెందడం బాధాకరమని వారు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



యువతకు కరపత్రాలను అందజేస్తున్న బ్రహ్మానందాచారి

బనగానపల్లె , జూలై 28: ధూమపానం, మద్యపానం ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని కావున వాటికి దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. ఆదివారం మండలంలోని పలుకూరు రామాలయంలో ధూమపానం, మద్యపానంపై కలిగే నష్టాలను గురించి వివరిస్తూ కరపత్రం విడుదల చేసి అనంతరం యువకులకు అవగాహన కల్పించారు. సిగరెట్, మద్యం గుండెను, ఊపిరితిత్తులను నాశనం చేస్తాయన్నారు. కాబట్టి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కెఇవెంకటసుబ్బయ్యగౌడ్, బాలహనుమంతు తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

దొర్నిపాడు, జూలై 28: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని దొర్నిపాడు అంకాలమ్మ గుడి ఆవరణలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ కొత్త చట్టాల ద్వార నేరాలు చేసిన వారికి త్వరితగతిన శిక్షపడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. యువత మద్యం, పేకాట తదితర అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మౌళాలి ఉన్నారు.

బనగానపల్లె: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నందివర్గం ఎస్ఐ తిరుపాలు అన్నారు. ఆదివారం మండలంలోని రామతీర్థం గ్రామంలో ఎస్ఐ గ్రామ సభను నిర్వహించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఓవర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

బుడ్డా వెంగళరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 28: ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాల ని జిల్లా టెలికాం మాజీ అడ్వయిజరీ సభ్యుడు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కోరారు. ఆదివారం ఆయన బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణమ్మగా పేరుపొందిన డొక్కా సీతమ్మ పేరున మధ్యాహ్న భోజన పథకానికి నామకరణం చేయడం అభినందనీయమన్నారు. సంక్షేమ పథకాలకు బుడ్డా వెంగళరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. బుడ్డా వెంగళరెడ్డి పెద్దగా చదువకపోయినా తల్లి నుంచి దానగుణాన్ని తెలుసుకొని జీవితమంతా పేదలకు సర్వస్వం త్యాగాలు చేశారని కొనియాడారు. అప్పటి బ్రిటీష్ పాలనలో కరువు కాటకాలు భయంకరంగా ఉన్నప్పుడు తన ధాన్యాగారం ద్వారా మొత్తం వేలాది మందికి అన్నదానం చేశారన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి బంగారు కంకణం, బిరుదు కూడా ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్పందించి బుడ్డా వెంగళరెడ్డి పేరును ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పెట్టాలని కోరారు.

సమాజ సేవకు పెన్షనర్లు పాటుపడాలి



పేదలకు అన్నదానం చేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

డోన్(రూరల్), జూలై 28: సమాజ సేవకు పెన్షనర్లు పాటుపడాలని డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేవెన్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం నాయకులు గోపాల్, రామదాసు రెడ్డి పట్టణంలోని లెప్రసీ కాలనీలో నివసిస్తున్న పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో పెన్షనర్ల చేస్తున్న సేవలను కేవెన్ భానుసింగ్ కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు దాసప్ప, గాలయ్య తదితరులు ఉన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో భక్తుల సందడి



ఆలయం పరిసరాల్లో భక్తుల రద్దీ

బేతంచెర్ల, జూలై 28: మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రం ఆదివారం భక్తులు కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శుక్ర శనివారాలలో తరలిస్తుంటారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆలయంలో కొందరు వేద పండితులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయకముందే వెళ్లమంటూ ఆదేశిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు భక్తులందరికీ వివక్షత లేకుండా దర్శన భాగ్యం కల్పించాలని కోరుతున్నారు.

బెలుంగుహల్లో సండే సందడి



బెలుం గుహలను తిలకిస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల, జూలై 28: మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల్లో సండే సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వచ్చారు. బెలుం గుహలకు ప్రవేశ రుసుం ద్వారా ఆదివారం ఒక్క రోజే రూ.56 వేల ఆదాయం వచ్చినట్లు బెలుం గుహల సిబ్బంది వెల్లడించారు.

ప్రజా వేదికకు తప్పనిసరిగా హాజరుకావాలి

కొలిమిగుండ్ల, జూలై 28: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆయా శాఖల మండల అధికారులతోపాటు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల, జూలై 28: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ఆవుల రామకృష్ణ అనే వ్యక్తి సుంకులమ్మ గుడి వద్ద కర్ణాటక అక్రమ మద్యం 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ ఆదివారం తెలిపారు. హనుమాన్ నగర్‌లో అక్రమ విక్రయాలు కొనసాగుతున్న సమాచారం మేరకు సుంకులమ్మ గుడి వద్ద రామకృష్ణ కర్నాటక మద్యం, టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తుండగా.. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

- మండలంలోని బుగ్గానిపల్లె తాండా గ్రామ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు సారా విక్రేతలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి ఆదివారం తెలిపారు. బుగ్గానిపల్లె తాండకు చెందిన తవూరు నాయక్ స్వామి నాయక్ అనే ఇద్దరు సారా విక్రేతలు గ్రామ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద నాటుసారా విక్రయిస్తుండగా.. వారిని అదుపులోకి తీసుకుని 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అమ్మవారికి పుట్టింటి సారె



కొలిమిగుండ్లలో పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి

శిరివెళ్ల, జూలై 28 : నంద్యాలలోని జగజ్జననీ అమ్మవారికి శిరివెళ్ల గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో ఆదివారం పుట్టింటి పట్టుచీర-సారె తీసుకెళ్లారు. ఆషాడమాస వేడుకల్లో భాగంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన రహదారి వెంట డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా నంద్యాలలోని జగజ్జననీ ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి పుట్టింటి పట్టుచీర-సారె, పలు రకాల పిండి వంటలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మహిళలు విశేష పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయంలో పార్వతిదేవి, అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా ఆదివారం సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, ఆకులతో అలంకరింప చేశారు. శాకంబరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి చీర, సారె, గోరింటాకును సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకమందు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

- చాగలమర్రి గ్రామంలో పెద్దమ్మ, గంగమ్మకు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆషాడమాసం సందర్భంగా పెద్దమ్మకు బోనాలు సమర్పించి మహిళలు పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలంటూ గంగమ్మ ఆలయంలో మహిళలు సామూహికంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆషాఢమాసం ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మరోవైపు మండలంలోని కనకాద్రిపల్లె అంకాళమ్మ ఆలయంలోనూ, అబ్దులాపురం పెద్దమ్మ ఆలయంలోనూ, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: మండలంలోని యల్లావత్తుల, రుద్రవరం, కొండమాయపల్లె గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ,మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించారు.

- మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని కందుకూరు రోడ్డులో ఉన్న సత్యమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. సత్యమకు లోకకళ్యార్థం బోనాలు సమర్పించినట్లు మహిళలు పేర్కొన్నారు.

- ఆళ్లగడ్డ మున్సిపాల్టి పరిధిలోని పి.చింతకుంట గ్రామంలో ఆదివారం సుంకులమ్మకు చీరసారె సమర్పించారు.



శిరివెళ్ల నుంచి అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలు



చాగలమర్రి కోదండ రామాలయంలో పార్వతీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

- ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు.